
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 | కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
3
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
ఆదివారం 8 డిసెంబరు 2024



అలంపూర్ ఆలయాల ప్రధాన అర్చకుడికి మెమో జారీ

అలంపూర్‌చౌరస్తా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత నెల 23న కర్నూలు పట్టణంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లిన అలంపూర్ ఎమ్మెల్యే దంపతులను అలంపూర్ ఆలయాల ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ ముసుగు కప్పుకుని ఫొటోలు తీశారు. ఎమ్మెల్యే కర్నూలు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. స్పందించిన దేవాదాయశాఖ ఆనంద్ శర్మను పదిరోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని మెమో జారీ చేసింది. సంజాయిషీ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని ఆలయ ఈవో పురేందర్ తెలిపారు.

మార్కెట్ స్థలం
కబ్జాకు కుట్ర

ప్రహరీ తొలగించేందుకు రంగం సిద్ధం

- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రణాళిక
- గుట్టుచప్పుడుగా కమీషన్ మర్చంట్స్ మీటింగ్‌లు
- ఇదే జరిగితే రైతులు, వ్యవసాయ ఉత్పత్తులకు రక్షణ కరువు
- ఇప్పటికే 11 ఎకరాల 30 గుంటల స్థలం ఇతరుల చేతుల్లోకి..



మునిసిపాలిటీ పాత పెద్ద డ్రైనేజీని తొలగించి దాని స్థానంలో చిన్నగా నిర్మిస్తున్న కాల్వ



గద్వాల వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

గద్వాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గద్వాల వ్యవసాయ మార్కెట్ ప్రమాదంలో పడింది. ఉత్తరం వైపు చింతల పేట రోడ్డు వైపు ప్రహరీ తొలగించి కమీషన్ మర్చంట్స్‌కు ఇచ్చిన స్థలాలలో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించేందుకు కుట్ర జరుగుతోంది. అందులో భాగంగానే మునిసిపాలిటీ నిర్మించిన డ్రైనేజీని తొలగించారు. దాని స్థానంలో ప్రయివేటు వ్యక్తులు కొత్తగా డ్రైనేజీని నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. మునిసిపల్ అధికారులు కిమ్మనడం లేదు. వ్యవసాయ మార్కెట్ అధికారులు స్పందించకపోతే రైతులకు, రైతు ఉత్పత్తులకు రక్షణలేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనే గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు గుర్తింపు ఉంది. 1956లో ఏర్పాటైన ఈ మార్కెట్‌కు మొదట వకీలు నాగప్ప ఆ తర్వాత సుధాకర్‌రెడ్డిలు చైర్మన్‌గా ఉన్నారు. 1965 నుంచి 1974 వరకు డీకే సత్యారెడ్డి చైర్మన్‌గా ఉన్నారు. ఆ సమయంలోనే గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు సర్వే నెంబరు 841/సి, 842/ఏ, 842/బి, 844, 846, 847,848/ఏ, 849/ఏ 849/బిలో 62-26 ఎకరాలను సేకరించారు. కాలక్రమంలో మార్కెట్ అభివృద్ధికి నిధుల సమస్య ఏర్పడి అందులో ఉత్తరం వైపు రోడ్డుకు కొంత భూమిని కమీషన్ మర్చంట్స్‌కు అప్పటి మార్కెట్ విలువ ప్రకారం విక్రయించారు. ఆ నిధులతో మార్కెట్‌ను అభివృద్ధి చేశారు. అయితే విక్రయించిన భూమిని మార్కెట్ నిబంధనల ప్రకారం కమీషన్ మర్చంట్స్ ఉపయోగించుకోవాలని, నిబంధనలు పాటించాలని అగ్రిమెంటు

(మిగతా 4లో..)

స్వయం ఉపాధికి
రుణాలు అందించాలి

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి



మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి, (కుడినుంచి) జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా బ్యాంకర్లు రుణాలు అందించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి అన్నారు. శనివారం గద్వాల కలెక్టరేట్‌లో మల్లురవి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ(దిశ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా రుణాలను మంజూరు చేయాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో రుణమేళాలు నిర్వహించి ఎక్కువ మందికి రుణాలు అందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకు ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని వివిధ పథకాల ద్వారా కేటాయించిన యూనిట్లను మంజూరు అయ్యేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు మంజూరైన యూనిట్లు, పెండింగ్‌లో ఉన్న యూనిట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21న వనపర్తిలో సీఎం పర్యటన సందర్భంగా యువతకు ఉపాధి కల్పించే దిశగా వృత్తి నైపుణ్యం, రుణమేళా, జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రుణాలకు సంబంధించి గ్రౌండ్ చేసిన రుణాలకు బ్యాంకర్లు వెంటనే యుటిలైజేషన్ సర్టిఫికేట్ జారీ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా ల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖ లో మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, మునిసిపల్ చైర్మన్ బీఎస్. కేశవ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తం

జూరాల ప్రాజెక్టు నిర్వహణ

- పాలకులు మారినా ప్రాజెక్టు పరిస్థితి మారలే
- అధ్వాన స్థితిలో పరిసర ప్రాంతాలు



జూరాల ప్రాజెక్టుపై గుంతల మయంగా ఉన్న రహదారి

5

ఎస్ఎన్ఎస్ పరిశ్రమను
మూసివేయాలి

- తహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన వివిధ గ్రామాల ప్రజలు

5

చైర్మన్ వర్సెస్ సెక్రటరీ

- మార్కెట్ కమిటీ సమావేశం రసాభాస
- లంచాలు తీసుకొని పత్తిబండ్లు పంపుతున్నారు : చైర్మన్
- రూపాయి తీసుకొని ఉంటే రాజీనామా చేస్తా : సెక్రటరీ



కార్యాలయ పద్దులు చదివి వినిపిస్తున్న సెక్రటరీ ఎల్లస్వామి

5

నాణ్యమైన భోజనం అందించాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



గిరిజన బాలికల వసతి గృహంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. విద్యార్థులు లక్ష్యం చేరే దిశగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని కూరగాయలు, వంట సరకులు, బియ్యాన్ని పరిశీలించారు. పాడైన కూరగాయలు వాడొద్దని, స్టాక్ పాయింట్ నుంచి బియ్యాన్ని తీసుకునే ముందే పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఆయన వెంట కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, వైస్ ప్రిన్సిపాల్ పార్వతమ్మ తదితరులు ఉన్నారు.

చదువు కోసం ప్రయాణ కష్టాలు

- వేళకు రాని ఆర్టీసీ బస్సులు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు

5



నాగర్‌దొడ్డి నుంచి పాఠశాలకు ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

విద్యావ్యవస్థను
గాడిలో పెడతా

- జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్



నాగర్‌కర్నూల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటానని డీఈవో రమేష్ కుమార్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లే సమయ వేళలు పాటించాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడానికి మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం ద్వారా విద్యాభివృద్ధికి దోహదపడే సంకేతాలను ప్రభుత్వం ఇస్తుంది. ఇటీవల కొత్త టీచర్ల నియామకం, పదోన్నతుల ద్వారా గ్రామీణ స్థాయిలో కూడా ఉపాధ్యాయ సిబ్బంది చిత్తశుద్ధితో కార్యాచరణను అమలు చేసేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నాం.

మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యత లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి..?

జిల్లా విద్యాశాఖ అధికారిగా తాను బాధ్యతలు స్వీక రించిన తర్వాత చాలా పాఠశాలలను సందర్శించాను. కొన్ని చోట్ల మధ్యాహ్న భోజనం విషయంలో మెనూ పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాటన్నింటినీ క్రమంగా సరిదిద్దుతాం. ప్రతీ ఎంఈవో రోజుకు కనీసం మూడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అదే రోజు సాయంత్రం వరకు నివేదికను అందించాలని ఆదేశాలు జారీ చేశాం.

ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి మీరేమంటారు..?

ప్రభుత్వ పాఠశాలలోని ప్రతీ విద్యార్థి వంద శాతం మార్కులు రావాలనే నిబంధన ఉండదు. పదో తరగతి పరీక్షల్లో అందరూ పది గ్రేడ్ మార్కులు సాధించకపోవచ్చు. ఆయా సబ్జెక్టులల్లో వీక్‌గా ఉన్న విద్యార్థులపై దృష్టి సారించి వారిని కూడా ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలనేదే నా అభిప్రాయం

జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం క్రమంగా పడిపోతుంది. దీనిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

ఈ విషయం వాస్తవమే. గత విద్యా సంవత్సరంలో పదో తరగత ఉత్తీర్ణత శాతం 20వ స్థానానికి పరిమితమైంది. దాన్ని మెరుగుపర్చే చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో మేము అమలు చేసే కార్యాచరణ ద్వారా ఎలాంటి ఫలితాలు వస్తాయో మున్ముందు మీరు చూస్తారు. విద్యార్థులను ఫలితాల పేరిట వేధించిన వారు కనీస మార్కులు సాధించకపోయినా హెచ్ఎంలు, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తాం.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



క్షయ వ్యాధి నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. 2025 మార్చి 24 నాటికి క్షయవ్యాధిని దేశం నుంచి పారద్రోలడానికి భారత ఆరోగ్య శాఖ చేపట్టిన వంద రోజుల కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం అంబులెన్స్, మొబైల్ ఎక్స్‌రే మిషన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశంలోని 700 పైచిలుకు జిల్లాలు ఉండగా అందులో కేంద్ర ఆరోగ్య శాఖ 200 జిల్లాలను క్షయవ్యాధి సమస్యాత్మక జిల్లాలుగా గుర్తించిందన్నారు. అందులో వనపర్తి జిల్లా కూడా ఉందని తెలిపారు. ఈ రోజు నుంచి జిల్లాలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి వైద్యం చేయాల్సి ఉంటుందన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి వారికి వెంటనే వైద్యం ప్రారంభించాలని సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... కరోనా సమయంలో జిల్లా వైద్య సిబ్బంది చాలా బాగా పనిచేశారని, అదే స్ఫూర్తితో మనసు పెట్టి జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. వ్యాధిగ్రస్థులకు ప్రతీ నెల కేంద్ర ప్రభుత్వం రూ. వెయ్యి ఇస్తుందని, తన వంతుగా ఒక్కొక్కరికి నెలకు మూడు కిలోల బియ్యం, 30 గుడ్లు, ఒక కిలో వంటనూనె, కిలో పప్పు ఆరునెలల పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ మహేష్, క్షయవ్యాధి ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడుతూ
స్పృహ తప్పిన విద్యార్థి మృతి

- సీఎం కప్ ఎంపిక పోటీల్లో ఘటన

4

స్థానిక సంస్థల్లోనూ
గెలుపు కాంగ్రెస్‌దే

- రౌడీరాజ్యం పోయి ప్రజారాజ్యం వచ్చింది
- రూ. 21వేల కోట్ల రుణమాఫీ ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే
- విలేకర్ల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దామోదర్‌రావు

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రౌడీరాజ్యం నడిచిం ది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజారాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి దామోదర్‌రావు అన్నారు. శనివారం గద్వాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకు దేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో రూ. 21 వేల కోట్ల రైతు రుణ మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కోటిమంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించుకున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 500 లకే వంట గ్యాస్ ఇవ్వడం జరిగిందన్నారు. 41 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని పేదలకు తెలిసిపోయిందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రతీ నెల ఒకటోతేదీ నాటికి ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నామని, వారు ఎన్ని కుట్రలు చేసినా స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని అన్నారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు గట్టు తిమ్మప్ప, రాజారెడ్డి, విజయ్, భాస్కర్, శ్రీను ముదిరాజ్, తుమ్మల నర్సింహులు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి దామోదర్‌రావు

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

భూత్పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పట్టణ కేంద్రంలో రెండు రోజులుగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతుతున్నాయి. శనివారం రెండో రోజు పోచమ్మ, కర్రెమ్మ, కోటమైసమ్మ, బొడ్రాయి, ఆంజనేయస్వామి, మునిరంగస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వేదపండితుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ, కర్రెమ్మ, కోట మైసమ్మ గ్రామ దేవతల ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన యాగశాలల వద్ద ప్రత్యేక హోమాలు చేశారు. ఈ యజ్ఞంలో మునిసిపల్ చైర్మన్ దంపతులు, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు విగ్రహాలకు జలాధి, ధాన్యాది వాసం చేశారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్నదానం చేశారు.



పోచమ్మ దేవాలయం వద్ద హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు, భక్తులు



పోచమ్మకు నవధాన్యాలను తెస్తున్న గ్రామస్తులు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మహిళలు

వీధి కుక్కల తరలింపు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా వీధి కుక్కలు పలు వార్డుల్లో స్వైర విహారం చేస్తూ పలువురిని గాయపరచడంతో పెద్దాసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న విషయం విధితమే. ఈ క్రమంలో వీధి కుక్కలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాలు జారీ చేయడంతో మునిసిపల్ కమిషనర్ హరీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం కుక్కలను తరలించారు. 12వ వార్డు బండమీదిపల్లిలోని వడ్డెర బస్తీ, బుడగజంగాల కాలనీ, బ్యాంకు కాలనీ, పాల్‌టెక్నిక్ కళాశాల సమీపంలో, పాలమూరు యూనివర్సిటీ, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో 42 వీధి కుక్కలను పట్టి వ్యానులో ఇతర ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ జాంగీర్, శివ, శ్రీను, వడ్డెన్న పాల్గొన్నారు.



వలతో పట్టిన కుక్కను తీసుకెళ్తున్న సిబ్బంది



పట్టిన కుక్కలను వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

గొర్రెల మందపై కొండ చిలువ దాడికి యత్నం

భూత్పూర్ మండలం గోపన్నపల్లి శివారులో ఘటన

భూత్పూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గొర్రెల మందపై కొండ చిలువ దాడికి యత్నించిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మునిసిపాలిటీలోని గోప్లాపూర్ గ్రామ శివారులో ఊరగుట్టపై శనివారం చోటు చేసుకుంది. కాపరుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోపన్నపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపారులు ఎప్పటి లాగే శనివారం గొర్రెలను మేత కోసం గోప్లాపూర్ గ్రామ శివారులో ఉన్న ఊరగుట్టపైకి తీసుకెళ్లారు. ఉన్నటుండి గొర్రెలన్నీ భయంతో చెల్లా చెదురుగా పారిపోయి. గమనించిన కాపరులు గొర్రెలు మేస్తున్న ప్రదేశానికి వెళ్లి చూశారు. భారీ కొంచిలువ ఒక గొర్రె పిల్లను నోట్లో వేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా కాపరులు కేకలు వేశారు. వారి అరుపులు విని అక్కడే వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు, కూలీలు వచ్చారు. అప్పటికే కొండ చిలువ దగ్గరలో ఉన్న ముళ్ల పొదల్లోకి వెళ్లింది. గత కొద్ది రోజులుగా కొన్ని గొర్రెలు కనిపించకుండా పోతున్నాయని, వాటిని ఈ కొండవచిలునే తిని ఉండొచ్చుని గొర్రెల కాపరులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అగ్రి డాక్టర్స్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక



ఉమ్మడి జిల్లా అగ్రిడాక్టర్స్ అసోసియేషన్‌తో రాష్ట్ర నాయకులు

పాలమూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీని శనివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా కమిటీ చైర్మన్‌గా జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్, వైస్ చైర్మన్‌గా ఆంజనేయులు (ఏడీఏ జడ్చర్ల), అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు (ఎంఈవో, మహబూబ్‌నగర్ అర్బన్), ప్రధాన కార్యదర్శిగా వి.కృష్ణ కిషోర్ (ఎంఈవో, నవాబ్‌పేట), కోశాధికారిగా యం.రాజేంద్ర అగర్వాల్ (ఏఏవో దేవరకద్ర) సహ అధ్యక్షులుగా గోపినాథ్ (ఎంఏవో జడ్చర్ల), కిరణ్‌కుమార్ (ఎంఏవో హన్వాడ),

ఆంజనేయులుగౌడ్ (ఏడీఏ) ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు సోలోమన్ నాయక్ రాథోడ్, జనరల్ సెక్రటరీ తిరుపతి నాయక్, వైస్ చైర్మన్ రాజరత్నం, అసోసియేట్ అధ్యక్షుడు నిశాంత్, ప్రచార కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

వాలీబాల్ ఆడుతూ స్పృహ తప్పిన విద్యార్థి మృతి

● సీఎం కప్ ఎంపిక పోటీల్లో ఘటన

పెద్దమందడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోంది. కానీ, క్రీడాకారుల ఎంపికలో అపశ్రుతి చోటుచేసుకొని ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిజపల్లి పాఠశాలలో శనివారం చోటుచేసుకున్నది. మృతుడి తల్లిదండ్రులు నీలమ్మ, కిషన్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం పామిరెడ్డిపల్లి తండకు చెందిన సాయిపునీత్(14) బలిజపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. సీఎం కప్ క్రీడల కోసం పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. పునీత్ ఉదయం వేళ ఖోఖో పోటీల్లో పాల్గొని స్పృహ తప్పి పడిపోవడంతో ఉపాధ్యాయులు అతని తల్లిని పిలిపించి ఇంటికి తీసుకెళ్లాలని చెప్పారు. కానీ, అతన్ని తీసుకెళ్ల లేదు. మళ్లీ మధ్యాహ్నం వాలీబాల్ ఆడుతూ స్పృహ తప్పి కింద పడిపోయాడు. వెంటనే ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని వనపర్తి ఏరి యా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపా రు. మృతునికి ఒక తమ్ముడు, ఒక చెల్లి ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వనపర్తి రాజీవ్ చౌరస్తాలో బాధిత తల్లిదండ్రులతో కలిసి బంధువులు ధర్నా నిర్వహించారు.



సాయిపునీత్ (ఫైల్)

ఘటనను చూసి స్పృహ తప్పిన మరో విద్యార్థిని

వాలీబాల్ ఆడుతూ స్పృహ తప్పి కింద పడిపోయిన సాయిపునీత్‌ను తోటి విద్యార్థిని ప్రియ చూసి తనూ స్పృహ తప్పింది. దీంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఇంటికి పంపారు.



బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా చేస్తున్న మృతుని తల్లిదండ్రులు, బంధువులు

మహిళపై వ్యక్తి దాడి

● కత్తితో బెదిరించి ఆభరణాలు అపహరించేందుకు యత్నం

● గొంతుపై తీవ్ర గాయం

నవాబ్‌పేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళపై కత్తితో దాడి చేసి, నగలు అపహరించేందుకు వ్యక్తి యత్నించిన సంఘటన నవాబ్‌పేట మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి వివరాల ప్రకారం.. మండలంలోని పల్లెగడ్డ గ్రామానికి చెందిన అంకమ్మ శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గ్రామం నుంచి జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామానికి బంధువుల వద్దకు వెళ్లేందుకు బయల్దేరింది. మార్గం మధ్యలో నవాబ్‌పేటలోని కల్లు దుకాణంలో కల్లు తాగి వెళ్తుండగా, అక్కడే ఉన్న మండలంలోని కూచూర్ గ్రామానికి చెందిన కరుణాకర్ రెడ్డి ఆమెను చూశాడు. తాను మహబూబ్‌నగర్ వెళ్తున్నానని తీగలపల్లి గేట్ వద్ద దించుతానని అంకమ్మను బైక్‌పై ఎక్కించుకున్నాడు. తీగలపల్లి గేట్ వద్ద ఆమెను దించకుండా, మైసమ్మ అడవిలోకి తీసుకెళ్లాడు. తర్వాత ఆమెపై దాడి చేసి, కత్తితో బెదిరించాడు. ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను లాక్కుంటుండగా పెనుగులాటలో అంకమ్మ గొంతుకు తీవ్ర గాయమైంది. రక్తం కారుతుండటంతో ఆమె కేకలు వేసింది. ఆ అరుపులు విన్న రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు పోలీసులకు, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తర్వాత మహిళ రోడ్డుపైకి వచ్చి స్పృహ తప్పి పడిపోయింది. కరుణాకర్‌రెడ్డి కూడా వచ్చి, కిందపడ్డాడు. అతని తలకు గాయం ఉన్నది. అంకమ్మను అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కరుణాకర్‌రెడ్డిని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

తల్లి వచ్చి ఆస్పత్రిలో చూపిస్తానని అతన్ని తీసుకెళ్లిందని తెలిసింది. కరుణాకర్ గతంలో మహిళలను హత్యచేసి, ఒంటిపై ఉన్న ఆభరణాలు దొంగిలించాడని, పలుమార్లు జైలు శిక్ష అనుభవించినట్లు తెలిసింది. 108 సిబ్బంది ఫిర్యాదు మేరకు అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వడ్డీలేని రుణాలతో ఆర్థిక అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం కానాయపల్లిలో 38 మహిళ స్వయం సహాయక సంఘాలకు రూ.4.37 కోట్ల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. ఈ వారంలో ఇల్లులేని వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం చేసుకున్న వారికి రూ.5 లక్షలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్, సీడీసీ చైర్మన్‌లు ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, జితేంద్రనాథ్‌రెడ్డి, సురేంద్ర నాథ్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్ పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

వెల్దండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని గొల్లోనిపల్లి పాఠశాలలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ వేసి పూజలు చేసి ఉండడంతో శనివారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎంఈవో చంద్రుడు పాఠశాలకు చేరుకొని వాటిని తొలగించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని గ్రామస్థులకు సూచించారు.

మార్కెట్ స్థలం కబ్జాకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి..)

కూడా ఉంది. ఇప్పుడు దానిని కమీషన్ మర్చంట్స్ తుంగలో తొక్కేందుకు సిద్ధమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రణాళిక!

ఉత్తరం వైపు చింతల పేట నుంచి అయిజ రోడ్డు రైల్వేస్టేషన్‌కు పెద్దరోడ్డు ఉంది. ఇప్పుడు ఆ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. గతంలో ఆవైపు మార్కెట్ కమిటీ నుంచి స్థలాలు తీసుకున్న కమీషన్ మర్చంట్స్ ఇప్పుడు కోట్లకు పడగలెత్తారు. వాళ్లలో కొందరు ఇతర వ్యాపారాలలో బిజీగా ఉన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేస్తే వ్యాపారాలు చేసుకోవడంతో పాటు పెద్ద ఎత్తున అద్దెలకు ఇచ్చుకోవచ్చన్న ఆలోచనతో వారి ప్రణాళికలకు పదును పెట్టారు. గుట్టుచప్పుడు కాకుండా సమావేశాలు పెట్టుకొని నాలుగు నెలలుగా కార్యాచరణను అమలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అడ్డంకులు రాకుండా ఉండేందుకు పెద్దల సహకారం కూడా తీసుకున్నట్లు సమాచారం.



కమీషన్ మర్చంట్స్ దుకాణాల వెనుక కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ

పాత డ్రైనేజీని తొలగించి..

మునిసిపాలిటీ నిర్మించిన పాత డ్రైనేజీని తొలగించి దాని స్థానంలో కొత్తగా డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నారు. ఈ నిర్మాణానికి మునిసిపాలిటీ నుంచి నిధులు, అనుమతులు ఇవ్వలేదు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా కొందరు కమీషన్ మర్చంట్స్ మార్కెట్ ఉత్తరం వైపు చింతల పేట రోడ్డుకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసుకోవాలని దాదాపు రూ. 50లక్షల సొంత డబ్బులతో ఈ నిర్మాణాలు చేస్తున్నట్లు తేలింది. ఇంత జరుగుతున్నా మునిసిపల్ అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్న డ్రైనేజీని కబ్జాచేస్తే పడగొట్టడానికి వచ్చే అధికారులు పెద్ద డ్రైనేజీని తొలగించినా కళ్లు మూసుకున్నారంటే దీని వెనక పెద్దలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. కమీషన్ మర్చంట్స్ అనుకున్నట్లు ప్రహరీ తొలగించి ప్రయివేటు నిర్మాణాలు చేస్తే ఆటు రైతులకు, రైతు ఉత్పత్తులకు మరింత రక్షణ కరువైతుందని రైతులు వాపోతున్నారు.

ఇప్పటికే ఇతర అవసరాలకు కేటాయింపు..

వ్యయసాయ మార్కెట్‌కు 1972లో 62 ఎకరాల 26 గుంటల భూసేకరణ చేశారు. దాని చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయితే 20 ఏళ్ల క్రితం సెంట్రవేర్ హౌజ్ గిడ్డంగుల నిర్మాణం కోసం 5 ఎకరాల 20 గుంటలు తీసుకున్నారు. ఆ తర్వాత విత్తనశుద్ధి కర్మాగారానికి ఒక ఎకరా 10 గుంటలు కేటాయించారు. ఇంత వరకు బాగానే ఉంది. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ భవన నిర్మాణానికి ఒక ఎకరం, పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఒక ఎకరం 20 గుంటలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రెండు ఎకరాల 20 గుంటలు తీసుకున్నది. ఇప్పుడు మిగిలింది దాదాపు 50 ఎకరాలు మాత్రమే.. ఇది కూడా పాలకుల నిర్ణయాలతో కరిగిపోతుందేమోనని రైతులు ఆందోళనలో పడ్డారు.

నోటీసులు జారీ చేశాం

మార్కెట్‌కు ఉత్తరం వైపు ప్రహరీ నిర్మాణం కూలగొట్టేందుకు కొందరు కమీషన్ మర్చంట్స్ సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారని మౌఖిక ఫిర్యాదులు అందాయి. కమీషన్ మర్చంట్స్ మార్కెట్ నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి. ప్రహరీని డ్యామేజ్ చేస్తే మార్కెట్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 26 మంది కమీషన్ మర్చంట్స్‌కు నోటీసులు జారీ చేశాం.



- నర్సింహులు, మార్కెట్ సెక్రటరీ, గద్వాల

మునిసిపాలిటీ డ్రైనేజీ నిర్మాణాలు చేయలేదు

మునిసిపాలిటీ పరంగా మేము అక్కడ డ్రైనేజీ నిర్మాణ పనులు చేయడం లేదు. ఇతరులు నిర్మాణాలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పాత డ్రైనేజీని తొలగించే అధికారం వారికి ఎవరికీ లేదు. ఏఈ, డీఈలను పంపించి విచారణ చేయిస్తాం.



- టీ దశరథ్ కమిషనర్, గద్వాల మునిసిపాలిటీ

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

కొల్లాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని 12వ వార్డులో కొన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. ఆ మహిళలకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. మునిసిపల్ అధికారులు కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య మాట్లాడుతూ కొల్లాపూర్ పట్టణానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ సింగోటం లక్ష్మీదేవమ్మ గుట్ట వద్ద లీకేజీ అవుతోందని తెలిపారు. మునిసిపల్ సిబ్బంది మరమ్మతు పనులు చేస్తున్నారని, రెండు రోజుల్లో కొల్లాపూర్ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు లక్ష్మీదేవమ్మ, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రమేష్ రాథోడ్, పరమేష్, మధు, పురేందర్, కట్టా శ్రీనివాసులు ఉన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలి

- కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో వెలమ సంఘం నాయకుల ఫిర్యాదు



కొల్లాపూర్ ఎస్ఐకి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

కొల్లాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెలమలను అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని శనివారం వెలమ సంఘం నాయకులు కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్‌కు ఫిర్యాదు చేశారు. వెలమ సంఘం నాయకులు మాట్లాడుతూ... బాధ్యతాయుత ఎమ్మెల్యేగా ఉండి వెలమల అంతు చూస్తానని బెదిరించే విధంగా అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వాడిన పదజాలంతో వెలమల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఎమ్మెల్యే వ్యాఖ్యలను కొల్లాపూర్ వెలమ సంఘం ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే వాడిన అసభ్య పదజాలంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు ఎస్ఐని కోరారు. వినతి ఇచ్చిన వారిలో నాయకులు బిచ్చారావు, కమలాకర్ రావు, సురేందర్‌రావు, రామచంద్రారావు, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం



జిల్లా కేంద్రంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గద్వాలటౌన్/ఉండవల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):గద్వాల పట్టణశివారు పిల్లి గుండ్ల కాలనీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు ఉదయం అభిషేకం, మంగళ స్నానాలు చేయించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకృష్ణసాగర్ అయ్యర్ ఆధ్వర్యంలో కల్యాణాన్ని జరిపించారు. కల్యాణోత్సవంలో 101 జంటలు పాల్గొని పూజలు చేశారు. కాలనీ వాసులతో పాటు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. అదేవిధంగా ఉండవల్లి మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం, భైరాపురం నిత్యభావన ఆశ్రమంలో శనివారం సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. రాజరాజేశ్వరి ఆలయంలో నిర్వహించిన హోమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు.

ఉత్తమ రీజియన్‌గా గుర్తింపు తెద్దాం

- ఆర్టీసీ ఆర్ఎం సంతోష్ కుమార్

కొల్లాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రీజియన్ పరిధిలోని వివిధ డిపోలలో పని చేస్తున్న ఉద్యోగుల సమష్టి కృషితో ఉత్తమ రీజియన్‌గా గుర్తింపు తీసుకొద్దామని ఆర్ఎం సంతోష్ కుమార్ అన్నారు. ఇటీవల ఆర్ఎంగా బాధ్యతలు తీసుకున్న ఆయన అన్ని డిపోల స్థితిగతులను తెలుసుకునేందుకు శనివారం కొల్లాపూర్ డిపో, బస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని వివిధ విభాగాలను పరిశీలించి ఉద్యోగులతో ముచ్చటించారు. అదే విధంగా బస్టాండ్‌లో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో అక్టోబరు నెల వరకు ఐదు కోట్ల రూపాయల మేర లాభాల్లో ఉందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ డిపోను మరింత లాభాల్లోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యంతో ఆర్టీసీ లాభాల్లో ఉందని, అయినప్పటికీ ఫెయిర్ పెయిడ్ ప్రయాణికులను పెంచుకునేందుకు ఉద్యోగులు మరింత కృషి చేయాలని కోరారు. మెకానికల్ సిబ్బంది బస్సులను జాగ్రత్తగా మెయింటెనెన్స్ చేయాలని, మార్గమధ్యలో బస్సులు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. డిపో మేనేజర్ ఉమా శంకర్ ఆర్ఎం సంతోష్ కుమార్‌కు శాలువాతో సత్కరించి పూలబొకేతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, మెకానికల్ సూపర్‌వైజర్ రహీం, కార్యాలయ సూపరింటెండెంట్ నజీర్, ఆయా విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్, చిత్రంలో డీఎం ఉమాశంకర్

తంబిహళ్లి పీఠాధిపతికి ఘన సన్మానం


యజ్ఞంలో పాల్గొన్న తంబిహళ్లి పీఠాధిపతులు విద్యాసింధు మాధవ స్వామి

మల్దకల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో జరుగుతున్న స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు విద్యాసింధు మాధవ స్వామి హాజరయ్యారు. దేవాలయంలో శనివారం జరిగిన గోపూజ, విశేష పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితానంద మహారాజ్ స్వామి కరకమలములతో భువనేశ్వరీదేవి, కమలాక్షి అమ్మవారి యజ్ఞం సాయంత్రం శ్రీలలితోపాఖ్యాన ప్రవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆదిశిలా క్షేత్ర చరితామృతం పుస్తకావిష్కరణ

స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదిశిలా క్షేత్ర చరితామృతం పుస్తకాన్ని తంబిహళ్లి పీఠాధిపతి విద్యాసింధు మాధవ స్వామి ఆవిష్కరించారు. పుస్తకాన్ని రచించిన రచయిత తెలంగాణ వాల్మీకి రాష్ట్ర అధ్యక్షుడు రేప లక్ష్మీకృష్ణ దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అంతకుముందు మండల కేంద్రానికి చేరుకున్న పీఠాధిపతులకు దేవాలయ అధికారులు సత్యచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు పలువురు భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

పల్లకీసేవ: మండల కేంద్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం దేవదేవుని పల్లకీ సేవను భక్తులు ఊరేగించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో దశమికట్ట వరకు ఊరేగింపు నిర్వహించారు.

డప్పుసప్పుడు మూగబోయింది

» నల్లమల కళాకారుడు రామకృష్ణ అనారోగ్యంతో కన్నుమూత


డప్పు రామకృష్ణ (ఫైల్)

పదర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని వంకేశ్వర గ్రామానికి చెందిన నల్లమల కళాకారుడైన డప్పు (పెర్మల) రామకృష్ణ అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. దాంతో నల్లమల కళాకారులందరు మా డప్పుసప్పుడు మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాదు నల్లమలతో పాటు, ఉమ్మడి పాలమూరు జిల్లా అంతట ఆయన డప్పు రామకృష్ణగా సుపరిచితుడే. విద్యార్థి దశ నుంచే రాడికల్ భావాలతో ఉండే రామకృష్ణ ప్రస్తుతం ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ ఖాసీం సహచర విద్యార్థి. అప్పటి నుంచే పల్లె పల్లెన వాల్ పేయింటింగ్ వేస్తూ విప్లవ భావజాలాన్ని రగిలించాడు. మూఢ నమ్మకాలను పాల ద్రోలాలని, రాత్రి బడి, పల్లె సుద్దులు తదితర కార్యక్రమాలతో ఊరూర కాళ్లకు గజ్జె కట్టి, డప్పు సప్పుడుతో కళాజాతా జట్టులతో కలిసి అవగాహన కల్పించారు. అంత్యక్రియలు ఆదివారం అమ్రాబాద్ మండలంలోని వంగురోనిపల్లిలో జరుగుతాయి.

క్రైం కార్నర్

అత్తారింటి వేధింపులతో

వివాహిత ఆత్మహత్య


అనిత (ఫైల్)

అయిజ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అత్తారింటి వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల గ్రామానికి చెందిన కుర్వ అనిత అలియాస్ మానస (21)ను ఏడాదిన్నర క్రితం సంకాపూర్ గ్రామానికి చెందిన కుర్వ భీమరాయుడితో ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. అత్తారి ఇల్లు అయిన సంకాపూర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పో సుకొని నిప్పంటించుకున్నది. మంటలకు తాళలేక బయటకు రావటంతో ఇరు గు, పొరుగువారు వచ్చి మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న ఆమె కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. అత్త రాములమ్మ, భర్త భీమరాయుడు వేధింపులకు తాళలేక తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి మల్దకల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకొని..

మక్తల్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణం ఎల్లమ్మకుంటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ మండలం హిందుపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి (33), భర్త గణేష్ హమాలీ చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కుటుంబ సభ్యులు సంసారం తరచూ గొడవలు, భార్య అనారోగ్య కారణాలతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. రాజేశ్వరి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డబ్బులు తీసుకొని ఉడాయింపు

- మాంగల్య షాపింగ్ మాల్ మేనేజర్ నిర్వాకం

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాంగల్య షాపింగ్ మాల్ మేనేజర్ సాయికృష్ణ డబ్బులు తీసుకుని పారిపోవడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చంద్రయ్య శనివారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాంగల్య షాపింగ్ మాల్ మేనేజర్‌గా పని చేస్తున్న వరంగల్‌కు చెందిన సాయికృష్ణ ప్రతిరోజు షాపింగ్‌మాల్‌కు సంబంధించిన డబ్బులు అకౌంట్‌లో జమ చేసేవాడు. ఈ నెల 5న 6లక్షల 90వేల రూపాయలు జరిగిన లావాదేవీలకు సంబంధించిన డబ్బులు అకౌంట్‌లో జమ చేయకుండా పారిపోయాడు. ఈ సంఘటనపై మరో మేనేజర్ గౌరీ శంకర్ శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై సాయికృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చంద్రయ్య తెలిపారు.

ప్రమాదవశాత్తు

చెరువులో పడి యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి సాయి(30) అనే యువకుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని నల్లవెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన సాయి అనే వ్యక్తి గ్రామంలోని ఒక రైతు దగ్గర పాడి గేదెలు మేపేందుకు జీతగాడిగా ఉన్నాడు. రోజువారీగా గేదెలను మేపుకుని నీళ్ల కోసం చెరువు దగ్గరకు గేదెలను తీసుకొని వెళ్లిన అతడు ప్రమాదవశాత్తు నీట మునిగాడు. ఈ సంఘటనను చూసిన వారు చెరువులో గాలించేసరికి మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై నాగర్‌కర్నూల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ చంద్రయ్య తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

మక్తల్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం టేకులపల్లి గ్రామ శివారులోని ఓ పొలంలో పేకాట స్థావరంపై శనివారం దాడి చేసి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. దాడిలో పది బైకులో, నాలుగు మొబైల్ ఫోన్‌లు, 19వేల నగదు పట్టుబడినట్లు తెలిపారు.

చిన్నపొర్లలో తప్పిపోయిన యువతి

- పోలీసులకు తండ్రి ఫిర్యాదు

ఊట్కూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొర్ల గ్రామానికి చెందిన యువతి కనబడక పోవడంతో శనివారం తండ్రి సంజప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ సురేందర్ కథనం ప్రకారం.. చిన్నపొర్ల గ్రామానికి చెందిన చిన్నసంజప్ప వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చిన తర్వాత ఇంట్లో కుమార్తె రాధిక (18) లేకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. తమ బంధువులకు ఫోన్ చేసి అడిగినా రాలేదని చెప్పడంతో ఉదయం వరకు ఇంటికి వస్తుందనే ఆశతో ఎదురు చూశారు. అయినా రాకపోవడంతో శనివారం ఉదయం ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అస్తవ్యస్తం

● జూరాల ప్రాజెక్టు నిర్వహణ

● పాలకులు మారినా ప్రాజెక్టు పరిస్థితి మారలే

● అధ్వాన స్థితిలో పరిసర ప్రాంతాలు

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా తయారైంది జూరాల ప్రాజెక్టు పరిసరాల పరిస్థితి. ప్రసిద్ధిగాంచిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పర్యాటకుల సందడి ఎక్కువగా ఉన్నప్పుడు వారి అవస్థలు వర్ణనాతీతం. ఎటు చూసినా చెత్తాచెదారం.. దుర్వాసన, కనీసం నిలువ నీడ లేని దుస్థితి దాపురించింది. వీటిపై స్పందించే నాథుడే కానరావట్లేదు.


జూరాల ప్రాజెక్టు పుష్కర ఘాట్ వైపు వెళ్లే దారి దుస్థితి


ప్రాజెక్టుపై గుంతల మయంగా ఉన్న రహదారి

అమరచింత, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై రాష్ట్రంలోనే తొలి ప్రాజెక్టుగా ప్రసిద్ధిగాంచిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన జూరాల ప్రాజెక్టు దుస్థితిపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు మారినా ప్రాజెక్టు పరిసరాల ప్రాంతాల్లో ఏమాత్రం వసతులు కల్పించలేదని చెప్పవచ్చు.

● ప్రాజెక్టు వద్ద నిలువ నీడ లేదు..

ఎక్కడి నుంచి వరద వచ్చినప్పుడు జూరాల గేట్లు ఎత్తి దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని వదిలినప్పుడు ఈ దృశ్యాన్ని చూసేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు సమీపంలో ఉండటంతో నీటిని వదిలినప్పుడు పర్యాటకుల తాకిడి మరింత ఎక్కువగానే ఉంటుంది. ప్రాజెక్టుపై కనీసం పర్యాటకులు నిలిచి ఉండటానికి ఒక చెట్టు.. కనీసం ఒక షెడ్డు కూడా నిర్మించలేదు. వచ్చిన పర్యాటకులు ఎండకు, వానకు, చలికి నిలిచి ఉండే పరిస్థితి ఏర్పడింది. కనీసం ప్రాజెక్టు సమీపంలో తాగునీటి వసతి గాని, వాడుకునే నీటిని గాని సమకూర్చకపోవడంతో పర్యాటకులు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది.

● అంధకారంలో జూరాల ప్రాజెక్టు

జూరాల ప్రాజెక్టుపై ఎడమ, కుడి భాగాల్లో విద్యుత్ స్తంభాలు దిష్టిబొమ్మలా కనిపిస్తాయి. సుదూర ప్రాంతం వరకు ప్రాజెక్టుపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పెద్ద పెద్ద డూమ్ లైట్లు ఏర్పాటు చేసినా అవి మాత్రం వెలగడం లేదు. పర్యాటకులు సాయంత్రమైతే చీకటిలో ఉండలేక వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. కనీసం ప్రాజెక్టుపై గద్వాల జిల్లా వైపు వెళ్లే ప్రయాణికులకు ఆలస్యంగా వచ్చే పర్యాటకులకు అంధకారంలో ఉండే పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుపై విద్యుత్ దీపాలు వెలగక పోవడం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రాజెక్టుపై ఆకతాయిలు, మద్యం తాగే వారి సంఖ్య , అసాంఘిక కార్యక్రమాలు వారి సంఖ్య దినదినం పెరుగుతుంది.

ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ముళ్లకంపలు, చెత్తా చెదారం, గుంతలమయమైన రోడ్లు ఇలా అనేక సమస్యలు ప్రాజెక్టు వద్ద కనిపిస్తాయి. ప్రాజెక్టు తిలకించడానికి వచ్చే పర్యాటకులకు ప్రాజెక్టు నిర్వహణ లోపం వారికి శాపంగా మారిందని చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రాజెక్టు నిర్వహణపై దృష్టి సారించి పర్యాటకులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కనీస వసతులు కరువు



జూరాల ప్రాజెక్టుపై కనీసం కూర్చోవడానికి వసతులు, నిలువ నీడ లేదు. తాగడానికి నీరు లేవు. ప్రభుత్వం చాలాసార్లు వసతులు కల్పిస్తామన్నది. ఇక్కడ మాత్రం ఎలాంటి వసతులు లేవు. మహిళా పర్యాటకులకు ప్రాజెక్టుపై ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● లక్ష్మి, మస్తిపురం గ్రామం

హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా జట్టు సత్తా చాటాలి

» ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

» అండర్-14 ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు సత్తాచాటాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) అండర్-14 అండర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలను శనివారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు అనేక విజయాలు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రా బబుల్స్‌కు 28 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని, మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను జిల్లా క్రికెట్ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. సీనియర్ క్రీడాకారులు శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.


హెచ్‌సీఏ అండర్-14 టోర్నీకి ఎండీసీఏ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చైర్మన్ వర్సెస్ సెక్రటరీ

» మార్కెట్ కమిటీ సమావేశం రసాభాస

» లంచాలు తీసుకొని పత్తి బండ్లు పంపుతున్నారు: చైర్మన్

» రూపాయి తీసుకొని ఉంటే రాజీనామా చేస్తా: సెక్రటరీ


సమావేశంలో చైర్మన్ దొడ్డెప్ప, సెక్రటరీ ఎల్లస్వామి మధ్య జరుగుతున్న వాగ్వాదం

అలంపూర్‌చౌరస్తా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ వ్యవసాయ మార్కెట్ సమావేశం రసాభాసగా సాగింది. చైర్మన్ వర్సెస్ సెక్రటరీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సిబ్బంది, సెక్రటరీ తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎన్నికైన తర్వాత రెండవ సమావేశం శనివారం అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ కార్యాలయంలో జరిగింది. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పత్తి కొనుగోళ్లపై ముఖ్యంగా చర్చించారు. పత్తి కొనుగోలు వ్యవహారంలో మార్కెట్ శాఖ ముఖ్య అధికారితో సహా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప ధ్వజమెత్తారు. శాఖ మొత్తం అవినీతిలో కురుకుపోయిందన్నట్లు ఆరోపణలు గుప్పించారు. కార్యాలయంలో డ్యూటీలు చేయనివారికి కూడా జీతాలు ఇస్తున్నారని అన్నారు. టోకెన్లు ముందు తీసుకున్నవారిని కాదని వెనక తీసుకున్నవారి వద్ద లంచాలు తీసుకుని పంపిస్తున్నారని ఆరోపించారు. కాగా, రైతుల వద్ద నుంచి తాము ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోతానని సెక్రటరీ ఎల్లస్వామి సవాల్ విసిరారు. టోకెన్ల ప్రకారమే ట్రాక్టర్లను పంపుతున్నామని, చైర్మన్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని, అవినీతికి తావు ఉండదని సెక్రటరీ ఎల్లస్వామి 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

చదువు కోసం.. ప్రయాణ కష్టాలు

» వేళకు రాని ఆర్టీసీ బస్సులు

» ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు

» గుంతలమయమైన రహదారుల్లో నిత్యం ప్రయాణం


నెట్టెంపాడు గ్రామం నుంచి ప్రైవేటు వాహనంపై పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు(ఫైల్)


నాగర్‌దొడ్డి నుంచి ఆటోలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థినీవిద్యార్థులు(ఫైల్)

ధరూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల వేళలకు అనుగుణంగా బస్సులు రాకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. పరిమితికి మించి వారిని ఎక్కించుకుని వెళ్లడంతో ఏదైన ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థుల తల్లిదండ్రుల వాపోతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని పలు గ్రామాలకు పని నిమిత్తం వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు సమయానికి బస్సులు రాకపోవడంతో నిత్యం సతమతమవుతున్నారు. అలాగే గద్వాల నుంచి నెట్టెంపాడుకు వచ్చే బస్సు సమయానికి రాకపోవడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. ధరూరు మండలంలోని నెట్టెంపాడు, ద్యాగదొడ్డి, ఉప్పేరు, మల్‌దొడ్డికి చెందిన ప్రజలు ఇతరత్రా పనులపై వెళ్లేందుకు బస్సులు సమయానికి రావడం లేదని చెబుతున్నారు. ఆయా గ్రామాల మీదుగా ఉప్పేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, నెట్టెంపాడు, నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, మల్‌దొడ్డి గ్రామాలకు సమయానికి బస్సులు లేవని, పాఠశాల వేళకు ఉదయం 8 గంటలకు బస్సును నడపాలని విద్యార్థులు కోరుతున్నారు.

సమయానికి రాని బస్సు

గద్వాల జిల్లా కేంద్రం నుంచి ధరూరు మండలంలోని నెట్టెంపాడుకు సమయానికి బస్సు రాకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. పలు గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రంతో పాటు గద్వాలకు పనుల నిమిత్తం వెళ్లాలన్నా నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటలకు బస్సు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులతో పాటు గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో గద్వాల నుంచి నెట్టెంపాడుకు, అక్కడి నుంచి నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, మల్‌దొడ్డి, ఉప్పేరు వరకు బస్సులు నడిపేవారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ సర్వీసును ఎందుకు కొనసాగించడం లేదో ఆర్టీసీ అధికారులే చెప్పాలని వారంటున్నారు.

కాగా, మహిళలకు ఉచిత బస్సు సర్వీసు అందుబాటులో వచ్చినప్పటి నుంచి బస్సుల సర్వీసులు తగ్గించారని చెబుతున్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయమై అధ్వానంగా మారాయి. ముఖ్యంగా నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, మాల్‌దొడ్డి, ఉప్పేరు వెళ్లే రహదారులపై కంకర తేలడంతో పాటు ఒకవైపు రోడ్డు కోతకు గురైంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో వెలుతుండటంతో అదుపుతప్పి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టడం, బోల్తా పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

సంబంధిత అధికారులు సమస్యలను దృష్టిలో ఉంచుకుని సమయానికి బస్సులు నడపాలని, రోడ్లకు తక్షణమే మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం

ధరూరు మండలంలోని నెట్టంపాడు, నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి ఇతర గ్రామాలకు సంబంధించిన విద్యార్థులు కాలినడకతో పాటు ప్రైవేటు ఆటోల్లో పాఠశాలలకు వెళుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులతో మాట్లాడి త్వరలోనే ఆయా గ్రామాలకు బస్సులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల వేళకు బస్సులు ఏర్పాటుకు సంబంధించి ఇటీవల అధికారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలోనే సమస్యను పరిష్కరించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- రవీంద్ర, ఎంఈవో, ధరూరు


సీజ్ చేసిన బహుళ అంతస్థుల భవనం

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న

రెండు భవనాలు సీజ్

» సెల్లార్‌తోపాటు అదనపు అంతస్థు నిర్మాణం

మహబూబ్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలిక పరిధిలో నిర్మాణంలో ఉన్న రెండు బహుళ అంతస్థులను సీజ్ చేశారు. పురపాలిక అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుండటంతో ముందుగా నోటీసులు ఇచ్చిన అధికారులు శనివారం రెండు భవనాలను సీజ్ చేశారు. రాజేంద్రనగర్‌లో అనుమతి లేకుండా సెల్లార్ నిర్మాణంతో పాటు ఐదో అంతస్తు నిర్మిస్తుండటం, అదే విధంగా చిక్కుడువాగు దగ్గర జీప్లస్ త్రీకి అనుమతులు తీసుకుని మరో అంతస్తు ఎక్స్‌ట్రాగా వేయడంతో ఈ రెండు భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు జ్యోత్స్న, లక్ష్మీకాంత్‌లు భవనాలు సందర్శించి కొలతలు తీయించారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతో వాటిని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, అనుమతుల మేర నిర్మాణాలు చేపట్టాలని ప్రజలకు సూచించారు.

ఎస్‌ఎన్‌ఎస్ పరిశ్రమను మూసివేయాలి

» తహసీల్దార్‌కు పలు గ్రామాల ప్రజల వినతి


తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందిస్తున్న పలు గ్రామాల ప్రజలు

ఎర్రవల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు గ్రామ శివారులో ఉన్న ఎస్‌ఎన్‌ఎస్ పరిశ్రమను మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలని శనివారం ఎర్రవల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందించారు. ఎస్‌ఎన్‌ఎస్ పరిశ్రమతో భరించలేని దుర్వాసన దాదాపు 5 గ్రామాలకు గుప్పుమంటున్నదని, దీంతో పరిష్కారం లేని సమస్యగా మారిందని పేర్కొన్నారు. వాయు కాలుష్యంతో పాటు జల కాలుష్యం కూడా చేస్తున్నారని, ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకుండా నీటిని సమీప పొలాల ద్వారా నేరుగా కృష్ణానదికి కలుషిత నీరు చేరుతుందన్నారు. దీంతో నీళ్ల తాగిన మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నట్లు వినతిలో పేర్కొన్నారు. పచ్చని పల్లెలపై విషం చిమ్ముతున్న ఈ పరిశ్రమను మూసివేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. స్పందించిన తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. తాను కూడా ఇటీవల కంపెనీని పరిశీలించేందుకు మండల మేజిస్ట్రేట్‌గా వెళ్లినా అనుమతించలేదన్నారు. దీంతో యాజమాన్య నిర్లక్ష్య ధోరణి స్పష్టమైందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో షేకుపల్లి, కొండేరు మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, ఈరన్న, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంజీవనాయుడు, భీమేశ్వర్‌రెడ్డి, బోట్టుబిళ్ల ఈరన్న, కృష్ణసాగర్, రాజేష్ సాగర్, నాగరాజు, అయ్యన్న తదితరులున్నారు.

ప్రజా ఆరోగ్యానికి రక్షిత మంచినీరు

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ టౌన్/ బిజినేపల్లి/ తిమ్మాజిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి ఇంటింటికీ రక్షిత మంచి నీరు సరఫరా చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బిజినేపల్లి మండలం బిజినేపల్లి తండాలో శనివారం రూ.8 లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును ప్రారంభించారు. తిమ్మాజిపేట రైతు వేదికలో యూనియన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ సహకారంతో 44 మంది రైతులకు స్ప్రింక్లర్లు యంత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండు ఆవరణలో టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పా ల్గొన్నారు. బిజినేపల్లి తండాలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. వట్టెం రిజర్వాయర్‌లో పునరావాస కాలనీలో మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయాలని తండా వాసులు కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ మద్దిలేటి, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్, జిల్లా నాయకుడు కొండ నగేష్, వంగ లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లుతిరుపతయ్య అమ్మతిరెడ్డి ఉన్నారు. అనంతరం తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి జగన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, నాయకులు శ్రీనివాస్ బహదూర్, దానం బాలరాజు, సురేందర్‌రెడ్డి,వివేక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రఘు, ఎల్లారెడ్డి, భాస్కర్‌గౌడ్, నాగసాయిలు, ముబారక్, భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఏఈవో సాయిరాం, నాగర్‌కర్నూల్‌లో డిపోమేనేజర్ యాదయ్య, ఆర్‌టీసీ సీఐ బాలనరసప్ప, కౌన్సిలర్లు శ్రీనివాసులు, నిజాముద్దీన్, జక్కారాజ్ కుమార్ రెడ్డి, సునీంద్ర, సుల్తాన్, అమ్మతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రయాణికులు పాల్గొన్నారు.


బిజినేపల్లి తండాలో పూర్తయిన వాటర్ ట్యాంకు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

ఇంటర్వ్యూ..

వరి కొయ్యలు కాల్చకుండా కలియదున్నాలి

- దీప్తి, మండల వ్యవసాయాధికారి



ఊర్కొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలు కాల్చకుండా డీ కంపోజ్ చేయడంపై రైతులకు రైతు నేస్తం పేరుతో అవగాహన కల్పిస్తున్నామని ఊర్కొండ మండల వ్యవసాయాధికారి దీప్తి 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

వరి కొయ్యలు అవశేషాలను కాల్చకుండా, కుళ్లింపజేసే విధానం ఏంటి ?

వరి కొయ్యల అవశేషాలను కాల్చకూడదు. వాటిని కుళ్లింపజేయడానికి సింగిల్ సూపర్ పాస్పెట్ (ఎస్ఎస్‌పీ)ను ఎకరానికి 50 కిలోలు, 10-15 కిలోల యూరియా వరి కొయ్యల అవశేషాలపై చల్లాలి. నీటి తడి ద్వారా డీ కంపోజింగ్ వేగవంతం చేశాక, రోటవేటర్‌తో మట్టిలో కలియదున్నాలి.

సింగిల్ సూపర్ పాస్పెట్ వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి ?

పాస్పరస్, సల్ఫర్ పంటలకు అందుబాటులోకి వస్తాయి. మట్టిలో జీవసత్వం పెరిగి పంట ఉత్పత్తి పెరుగుతుంది.

రైతులకు ఏమైనా సూచనలు చేస్తారా ?

పంట కొయ్యలను కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మంగళవారం చేపడుతున్న రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పంటల సాగుకు వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో సమ్మద్ధిగా పంటలు పండించుకోవడానికి అవకాశాలు ఉంటాయి.

సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

తెలకపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలో జరిగే సీపీఎం జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం తెలకపల్లిలోని సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, కర్షకుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి గోపాస్ లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు ఎం.విజయ్‌గౌడ్, జగదీశ్, కొంగరి కాశన్న పాల్గొన్నారు.

మహాసభల వాల్ పోస్టర్లు విడుదల

తాడూరు : అచ్చంపేట పట్టణంలో ఈ నెల 14, 15వ తేదీల్లో జరుగుతున్న సీపీఎం మూడవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి అంతటి కాశన్న డిమాండ్ చేశారు. తాడూరులో శనివారం సీపీఎం జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను కాశన్న విడుదల చేశారు. సీపీఎం జిల్లా మూడవ మహాసభలకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు జిల్లా మూడవ మహాసభలకు బీవీరాఘవులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు చెన్నకేశవులుసుందర్, ఎన్నాపోయిన వెంకటస్వామి, అంతటి మహేష్, అంతటి శివకృష్ణ, బాలరాజు, తిరుపతయ్య పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం

కల్వకుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి తల్లిదండ్రుల సమావేశం శనివారం ప్రిన్సిపాల్ వీరారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేస్తున్నారని అన్ని రకాల వసతులు కళాశాలలో ఉన్నాయని తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణయ్య, అధ్యాపకులు రమాకాంత్, సదానందంగౌడ్, లక్ష్మీకాంత్, సాగర్, శ్రీనివాస్, బీమేష్, మల్లేష్, వరుశరామ్, గిరిబాబు, బలరాం, మహబూబ్‌అలీ, జుబేర్, బిలకిత్‌పాష, లక్ష్మయ్య, నరసింహులు, హైమద్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలి'

చారకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేశాకే ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అర్పుల నారాయణ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పర్వతాలు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను ఏబీసీడీ వర్గీకరణ చేసి ఎస్సీ జాబితాలోని 59 ఉప కులాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పట్కు రామరాజు, నరేష్, రామస్వామి, కిరణ్, రాజు, పట్టెపు బాలయ్య, వనుల శ్రీను, రాంబాబు, వినోద్, శ్రీకాంత్, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చారకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో యాస్మిన్‌బేగ్ అన్నారు. శనివారం మండలంలోని జూపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సీఎం 1 కప్ తెలంగాణ గ్రామస్థాయి క్రీడా పోటీలను ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అండర్-14 కబడ్డీ, ఖోఖో గ్రామస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. సోమవారం వాలీబాల్, రన్నింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడలు స్నేహభావంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

-డీఈవో రమేష్‌కుమార్

తాడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు బాటలు వేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్ సూచించారు. తాడూరు మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలను, ఎండబెట్ల ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలను డీఈవో శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదిలో విద్యార్థులు చదువుపై ఏ మేరకు పట్టు సాధించారో దాని పై ఆరా తీశారు. విద్యార్థులతో పలు ప్రశ్నలు రాబట్టారు. పదవ తరగతి విద్యార్థులు ఇప్పటి నుండే కష్టపడి చదవాలన్నారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని గిరిజన విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. భోజన విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిది అబద్ధాల పాలన


ఆరు అబద్ధాలు 66 మోసాల పేరిట చార్జిషీట్ కరపత్రం విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. శని వారం కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది వైఫల్యాలపై 6అబద్ధాలు 66మోసాల పేరిట గురువారం పట్టణంలోని కార్యాలయంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో అమలుకు ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకోవాలో కనీసం రోడ్ మ్యాప్‌కూడా లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు, మంగ్యానాయక్, బాలాజీ, జానకీ, కొండలిరెడ్డి, శ్రీనునాయక్, గణేష్, మోదీ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి సమావేశానికి బయల్దేరిన నాయకులు

కల్వకుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భారత జాగృతి సమీక్షా సమావేశం ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో జరిగిందని భారతజాగృతి కల్వకుర్తి మండల అధ్యక్షుడు దారమోని గణేష్ తెలిపారు. సమావేశంలో భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలపై కవిత పలు సూచనలు, సలహాలు చేశారని ఆయన పేర్కొన్నారు. కవితను కలిసిన వారిలో జిల్లా జాగృతి నాయకులు చిలుక మంజుల, సుశీల, ప్రియాంక, కృష్ణ, పర్వతాలుగౌడ్, రవి, శేఖర్‌గౌడ్ ఉన్నారు.


ఎమ్మెల్సీ కవితతో జాగృతి సభ్యులు

పది నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

- ఎంఈవోకు సమ్మె నోటీసు

కొల్లాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులందరూ ఈనెల 10వ తేదీ నుంచి తమ సమస్యల పరిష్కారం కొరకు నిరవధిక సమ్మెకు వెళ్తున్నారు. ఈ మేరకు పలువురు ఉద్యోగులు కొల్లాపూర్ ఎంఈవో ఇమాన్యుయేల్‌కు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. సమగ్ర శిక్షాఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు విష్ణుయాదవ్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తానని చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకో ఇలకున్నందుకే కేజీబీవీ, ఎమ్మార్సీ, కాంట్రాక్ట్ స్టాఫ్, పీటీలు అందరూ నిరవధిక సమ్మెలో పాల్గొనడానికి నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సుదర్శన్ సింగ్, మహమ్మద్ అలీ, రామకృష్ణ, సుమిత్ర, ఉపేందర్, సీఆర్‌పీ కళ్యాణి, కురుమూర్తి పాల్గొన్నారు.

● వంగూరులోనూ సమగ్ర శిక్షా ఉద్యోగుల రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులు స్వాతి, లక్ష్మణ్ గౌడ్, సురేందర్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.


కొల్లాపూర్ ఎంఈవోకు సమ్మె నోటీసు ఇస్తున్న ఉద్యోగులు

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్


హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కొత్తపల్లి వినోద్

తాడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన కొత్తపల్లి వినోద్‌కుమార్ ఇటీవల యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా గెలుపొందారు. దీంతో శనివారం హైదరాబాద్‌లోని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే


శ్రీవారి దర్శనం అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

కల్వకుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని కల్వకుర్తి కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంట సోదరుడు వెంకటరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, డాక్టర్ హరికాంత్ ఉన్నారు.

జూపల్లిలో అంబేడ్కర్ యువజన కమిటీ ఎన్నిక

చారకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆరేకంటి నిరంజన్, ఉపాధ్యక్షుడిగా ఈశరల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా అంకిత్ ప్రశాంత్, కార్యదర్శిగా జంతికంటిసేయులు, కోశాధికారిగా కొండేటి పరశురాములు, ప్రధాన సహాయ రులుగా మధు, మహేష్, క్రీడా కార్యదర్శిగా బాలస్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా మల్లికార్జున్, మీడియా ఇన్‌చార్జిగా శైలేష్, గౌరవ సలహాదారుడిగా యుగంధర్‌లను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఇటీవల కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన 'పేక్ మస్తప్ప' ముజ్జబాయన్ను నాయకులు శాలువాతో సన్మానించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంపద అభివృద్ధికి ప్రణాళికలు

- కలెక్టర్ బదావత్ సంతోష్


మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పశుసంపద అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని బ్రహ్మరాంబిక మల్లికార్జున కళాశాలలో ఏర్పాటు చేసిన పీవీ. నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్య కళాశాల రాజేంద్రనగర్ ఆఖరి సంవత్సరం విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాడి పరిశ్రమ రైతులకు లాభసాటిగా ఉండేవిధంగా కావాల్సిన చర్యలను సూచించాలని పశువైద్య విశ్వవిద్యాలయం అధ్యాపక బృందాన్ని కోరారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డాక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 28గ్రామాల్లో మొత్తం 8000 పశువుల కు చికిత్స అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ జీవీఎమ్మెస్, విజయ డెయిరీ డీడీ దండాకర్, ఎన్ఎస్ఎస్ క్యాంపు ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కేఎస్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ విజయ్, డాక్టర్ గోపాల్, పశుసంవర్థక శాఖ డాక్టర్లు, పీవీఎస్సీ పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

నాగర్‌కర్నూల్ : వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టరేట్ సమీపంలో గల గోదాంలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ ద్వార భద్రత, పోలీస్ బందోబస్తును కలెక్టర్ పరిశీలించారు. రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డీఈఓ అరుణరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రవికుమార్, ఎలక్షన్ డీటీ రఘు, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాసులు, హసేన్, బాలకృష్ణ, వెంకటయ్య, రామకృష్ణ ఉన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలించాలి

జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. క్షయ వ్యాధి నిర్మూలనకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాను క్షయ వ్యాధిగ్రస్తులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో వంద రోజుల కార్యాచరణపై ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, వెంకటదాస్, భీమానాయక్, టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజశేఖర్ వైద్యులు పాల్గొన్నారు.

15న ఎదిరేపల్లి మశమ్మ స్మారక పురస్కారం


కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ మందిరంలో ఎదిరేపల్లి మశమ్మ స్మారక పురస్కార ప్రధాన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పురస్కార కమిటీ అధ్యక్షుడు ఎదిరేపల్లి కాశన్న తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో పురస్కార మహోత్సవ కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎదిరేపల్లి మశమ్మ పురస్కారం- 2024కు ప్రముఖ కవి, విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు కింద రూ.20 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదు బుక్ ఫెయిర్ అధ్యక్షుడు, కవి డాక్టర్ యాకూబ్, ప్రధాన వక్తగా ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని కవులు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎదిరేపల్లి మశమ్మ పురస్కార కమిటీ సభ్యులు వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, వహీదాఖాన్, ఆర్.సత్యం, ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పడిపూజ

మన్ననూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు గ్రామంలో హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భజన హనుమాన్ అష్టోత్తర శతనామావళి పఠనం చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర పాలక మండలి డైరెక్టర్ సంబు శేఖర్, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ, వేణుగోపాల స్వామి ఆలయ అధ్యక్షుడు పులిజాల శేఖర్, కమిటీ సభ్యులు జయమ్మ, ప్రభావతమ్మ, బాలకృష్ణ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

శాస్త్రోక్తంగా శనీశ్వరుడికి భక్తుల పూజలు

బిజినేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జేష్ఠాదేవి సమేత శనీశ్వర స్వామికి భక్తులు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి జిల్లేడు పూలు, నల్లని వస్త్రం, నల్లని నువ్వులు, నువ్వుల నూనె వంటి పూజ సామగ్రితో శనీశ్వరుడుని స్మరించుకుంటూ ప్రదక్షిణలు చేశారు. ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అనంతరం భక్తులు స్వామి ఆవరించి పరుహూరుతూ ఉన్న రుద్రేశ్వరుడిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. నందీశ్వరుడిని దర్శించుకున్నారు. భక్తులకు వసతులను ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రావు, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, చెన్నయ్య గోపాల్ రెడ్డి పర్యవేక్షించారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి : సీఐటీయూ

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తా ఆటో స్టాండ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. రామయ్య మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలతో ఉన్న ఆటో కార్మికుల బతుకులపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం మరింత ఇబ్బందుల్లో నెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల హామీ వెంటనే అమలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జానపల్లి కురుమూర్తి, నాయకులు శివయ్య, సైదులు, కృష్ణయ్య, వెంకయ్య, భాస్కర్, ఇసాక్, వెంకటస్వామి, మల్లేష్, శివకుమార్, బయ్యాం, కేశవ పాల్గొన్నారు.

విత్తనాల నాణ్యతలో రాజీ పడకూడదు

- ఏవో సందీప్‌కుమార్‌రెడ్డి

తాడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటకు సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే విధంగా రైతు ఆగ్రో సేవా కేంద్రాలు పని చేయాలని ఏవో సందీప్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఐతోల్ గ్రామంలో ఉన్న రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యాసంగిలో రైతులకందించే వరి విత్తనాలకు సంబంధించిన నమూనాలను సేకరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోతోపాటు రైతు ఆగ్రో సేవా కేంద్రం ప్రొప్రైటర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల ముందు కంపు

పదర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉడిమిళ్ల గ్రామంలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ముందు మురికి నీటి కుంట, పక్కనే పెంటదిబ్బలు ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలకు నిలయంగా మారింది. గిరిజన ఆశ్రమ పాఠశాల ముందున్న మురికినీటి గుంతలను శుభ్రపరచాలని పలుమార్లు సంబంధిత నాయకులు ఐటీడీఏ అధికారులకు, పాఠశాల అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు. సమస్యను పరిష్కరించకపోతే మద్దిమడుగు ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తామని తెలిపారు. సమీపంలో నాయకులు మల్లికార్జున్, చిన్న అంజయ్య, పెద్దులు, వీరయ్య, సోమయ్య, అంజయ్య, శివయ్య తదితరులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

ఇదే విషయంపై 'ఆంధ్రజ్యోతి' డీటీడీవో చత్రునాయక్‌ను వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని అన్నారు. తాను ఒక వారం రోజులకు ఇన్‌చార్జిగా వచ్చానని తెలిపారు. వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని వివరించారు.


గిరిజన ఆశ్రమ పాఠశాల ముందు పేరుకుపోయిన మురుగునీరు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని హోంగార్డ్ ఆఫీసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హోంగార్డ్ సిబ్బందికి వేతనం రూ. 921 నుంచి రూ. 1000కు గాను, పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ. 200కు ప్రభుత్వం పెంచింది. కార్యక్రమంలో అధ్యక్షుడు జమ్ములు, ఉపాధ్యక్షులు రాజమల్లేష్, వీఆర్‌వో యాదయ్య ఇతర హోంగార్డులు పాల్గొన్నారు. నాయకులు తమ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు దేరంగుల బాలస్వామి, వెంకటయ్య, శేఖర్, రామకృష్ణ, లక్ష్మయ్య, చెన్నయ్య, సత్యం పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

తిమ్మాజిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్ ఏపీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యులు ఇస్మాయిల్, పార్వతమ్మ, సుపర్వైజర్లు బాలరాజు, స్టాఫ్ నర్సు రోజలీ, ల్యాబ్ టెక్నీషియన్ రాజగోపాల్, సూపర్‌వైజర్ మణికుమారి ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

తిమ్మాజిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు వేదికలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డికి వడ్డెర సంఘం

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

మన్ననూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంబు నారాయణను ఆయన స్వగ్రామం వెంకటేశ్వరబావి గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సంబు వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంది హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెద్దుల వెంకటేశ్వర్లు, జూలూరి సత్యనారాయణ, తుల్యా నాయక్, శివాజీ, బాబు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

కందనూలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ వినోభానగర్ కాలనీలో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శనివారం ఆలయ ఆవరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం వేద మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా కల్యాణోత్సవం, అభిషేకం, ఊరేగింపు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సర్ప వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త మూడెం సుబ్బారావు, కుటుంబ సభ్యులు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హాకీం విశ్వప్రసాద్, విశ్వనాథం పరంధాం సభ్యులు వేణు, సహాయ అర్చకులు సర్వశంకరప్రసాద్‌శర్మ, భారతి, విజయ్‌కుమార్‌శర్మ, డాక్టర్ ఏ.శ్రీనివాసులు, రమానాథ్‌గౌడ్, కొండల్‌రెడ్డి, స్వప్న, పద్మమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పదర ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్

పదర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్ సర్వీసు ఏర్పాటు చేసినట్లు 108 సర్వీసు నాగర్ కర్నూల్ జిల్లా మేనేజర్ శ్రీను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఆసుపత్రికి ల్యాబ్ టెక్నీషియన్‌గా రెడ్యా నాయక్‌తో పాటు మరో ఇద్దరు సూచన పాటు డాక్టర్లు విధులోకి వచ్చారని, అందులో డాక్టర్ పావని చార్జ్ తీసుకోగా డాక్టర్ సోమవారం జాయిన్ అవుతారని ప్రస్తుత పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఆస్పత్రి సమస్యల పై 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంపై మండల వాసులు విష్ణు, అర్జున్, వెంకటేష్, సాయి రాథోడ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.